# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు, రేపు విశాఖలో పర్యటించనున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'తల్లికి వందనం' కార్యక్రమం మార్గదర్శకాలను త్వరలో ప్రవేశపెట్టనున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు.
- పర్యాటక రంగంపై ప్రభుత్వం చేస్తున్న కృషితో ఆంధ్రప్రదేశ్ పర్యాటకం ప్రత్యేకతను చాటుతోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

========================

రాష్ట్ర ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని మే నెలలో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనుందని విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, ''తల్లికి వందనం' పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామన్నారు. బడ్జెట్‌లో 9 వేల 407 కోట్ల రూపాయలను ఈ పథకానికి కేటాయించామని, గతంతో పోలిస్తే ఇది 50 శాతం అధికమన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇంటిలో చదువుకునే పిల్లలందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని మంత్రి లోకేశ్ వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

========================

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఈరోజు ఆమె విజయవాడ నుంచి దృశ్య మధ్యమా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న రక్షణ, భద్రత, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. వివిధ రంగాల్లో రాణించిన

మహిళలను గుర్తించి, వారిని సత్కరించాలని అన్నారు. మహిళా లబ్దిదారులను ఎంపిక చేసి రుణాలు, బ్యాంకు లింకేజీల చెక్కులు, ఉపకరణాలను పంపిణీ చేయాలని సూచించారు.

========================

రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటకం తనదైన ప్రత్యేకతను చాటుతోందని ఆ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జర్మనీ పర్యటనలో భాగంగా మంత్రి ఈరోజు పలువురు పెట్టుబడిదారులతో భేటీ అయ్యారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి అవకాశాలు, వనరుల గురించి వివరిస్తూ, పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.. ఐటీబీ బెర్లిన్ -2025 సదస్సుకు హాజరుకావడం సంతోషంగా ఉందని, అంతర్జాతీయ పర్యాటక పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ఉపకరిస్తుందని పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు, రేపు విశాఖలో పర్యటించనున్నారు. ఈరోజు ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్ళిన ముఖ్యమంత్రి రాత్రి 9 గంటల 30 నిమిషాలకు ఢిల్లీ నుంచి విశాఖపట్నానికి రానున్నారు. రేపు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు గీతం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగే దగ్గుబాటి వెంకటేశ్వరరావు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరవుతారు. రేపు మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి 4 గంటలకు ఢిల్లీకి చేరుకుంటారు. అలాగే సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు భారత మండపంలో జరిగే రిపబ్లిక్ టీవీ కాన్ క్లేవ్‌లో పాల్గొంటారు. 6వ తేదీ రాత్రి ఢిల్లీలోనే బస చేసి 7వ తేదీ ఉదయం బయలుదేరి అమరావతికి తిరిగి చేరుకుంటారు.

విరామం

========================

గత కొన్ని దశాబ్దాలుగా వైద్య ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక భూమిక పోషిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పారా మెడికల్ సిబ్బంది కొనసాగింపుపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమధానమిస్తూ.... ఒప్పంద ప్రాతిపదికపై నియమించిన పారామెడికల్ సిబ్బంది తొలగింపు వ్యవహారంలో ప్రభుత్వం సుప్రీం కోర్ట్ తుది తీర్పునకు లోబడి వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని, దానిలో భాగంగా పీపీపీ మోడల్ లో వైద్య కళాశాలలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలుపుతూ....

(వాయిస్ 40 సెకన్లు)

========================

రాజధాని అమరావతి నిర్మాణాన్ని త్వరతగతిన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివ నాథ్ అన్నారు. విజయవాడ ఎస్. ఎస్ కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన ఏపీ కన్స్ట్రక్షన్ ఎక్స్ పో ను ఎంపీ ఈరోజు సందర్శించి స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాజధాని నిర్మాణం పనులు ప్రారంభమవుతున్న తరుణంలో ఇటువంటి ఎక్స్ పో నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. నిర్మాణ రంగంలో రావాల్సిన మార్పులు, అదే విధంగా అమరావతి నిర్మాణంలో భాగస్వామ్యం తదితర అంశాలపై ఈ ఎక్స్ పోలో చర్చిస్తున్నారన్నారు.

========================

విజన్ 2047 స్ఫూర్తితో రాష్ట్రంలో అభివృద్ధిని సాధిస్తామని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈరోజు శాసన మండలిలో మంత్రి మాట్లాడుతూ... 2020 విజన్ ఫలితం నేటి హైదరాబాద్ అని, అదే స్ఫూర్తితో 2047 నాటికి అన్ని రంగాల్లో రాష్ట్రం ఉన్నత స్థానంలో నిలిచేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రజా రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతామని తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

"పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" అమలును జిల్లాలో వేగవంతం చేయాలని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈరోజు అనంతపురంలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో "పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" పథకంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... ఈ పథకం అమలులో జిల్లాని ప్రథమ స్థానంలో నిలిపేలా అధికారులు పని చేయాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి కేటాయించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

========================

గిరిజన నిరుద్యోగ యువత నుండి సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ ఇన్‌ఛార్జి ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 100 మంది గిరిజన యువతకు వేపగుంట యూత్ శిక్షణా కేంద్రంలో శిక్షణ అందించనున్నామని తెలిపారు. ఈ నెల 6 నుండి 13వ తేదీ వరకు ఐటిడి ఏ కార్యాలయంలో దరఖాస్తులు పంపిణీ, స్వీకరణ ఉంటుందన్నారు.

========================

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గాను రైతులకు 50 శాతం వరకు రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించడానికి నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 2 కోట్ల 47 లక్షల రూపాయలను రాయితీపై రైతులకు అందించనున్నామని జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు, ఫుట్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ దుక్కి, రోటో వేటర్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు వంటి వ్యవసాయ పరికరాలను రైతులు రాయితీపై తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు దగ్గరలో గల రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

========================
========================